చిలిపిచెడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన నాయకులు, యువకులు

రామాయంపేట : కాట్రియాల తండాలో భోగ్‌భండార్‌తో గిరిజన మహిళలు

చేగుంటలో సేవాలాల్ జయంతి వేడుకలు

సేవాలాల్‌కు ఘనంగా

భోగ్‌భండార్

మెదక్ జిల్లాలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని గిరిజన తండాల్లో ఘనంగా గురువారం నిర్వహించారు. గిరిజన మహిళలు బోనాలతో సేవాలాల్ ఆలయాలకు చేరుకుని భోగ్‌భండార్ పూజలు చేశారు. తమ ఆచార వ్యవహారాల్లో భాగంగా అమ్మవారు జగదాంబికా మాత, సేవాలాల్ మహరాజ్‌కు మంగళ హారతులు, నైవేద్యాలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు తెల్లవారుజాము నుంచే తండాల్లో ఒక్కచోటుకు చేరుకుని పాటలు పాడుతూ మహరాజ్ చిత్రపటాన్ని ర్యాలీగా ఊరేగించారు. అనంతరం అన్నదానం నిర్వహించి, సహపంక్తి భోజనాలు చేశారు.

- మెదక్ జిల్లా నెట్‌వర్క్, ఫిబ్రవరి 15

సేవాలాల్ గొప్ప సంఘ సంస్కర్త

■ జయంతి ఉత్సవాల్లో అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 15 : సేవాలాల్ మహరాజ్ గొప్ప సంఘ సంస్కర్త, తన బోధనలతో బంజారాలను సన్మార్గంలో నడిపించిన మహనీయుడని అదనపు కలెక్టర్ రమేశ్ అన్నారు. బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని మీరానగర్‌లో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక మార్గంలోనే కాకుండా బంజారాల హక్కుల కోసం నిజాం, మైసూర్ పాలకులకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో సేవాలాల్ కీలక పాత్ర పోషించారన్నారు. బంజారా భాషకు ఒక రీతిని సమకూర్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. బంజారాలు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆలరిపించాయి. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, జిల్లా మైనింగ్ అధికారి జయరాజు, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమాధికారి విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నార్సింగిలో జరిగిన వేడుకల్లో ఎంపీపీ సబిత, జడ్పీటీసీ కృష్ణారెడ్డి తదితరులు

చిన్నశంకరంపేటలో జరిగిన సేవాలాల్ పల్లకీ సేవలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

కొల్చారంలో నిర్వహించిన ర్యాలీలో జడ్పీటీసీ మేఘమాల, బీఆర్ఎస్ నాయకులు

రేగోడ్‌లో సంత్‌సేవాలాల్ జయంతి ఉత్సవాలు

తూప్రాన్ : సేవాలాల్ జయంతిలో పాల్గొన్న మత్స్యశాఖ డైరెక్టర్ గడప దేవేందర్ తదితరులు

రైతు వ్యతిరేక బీజేపీకి గుణపాఠం చెప్పాలి

మాట్లాడుతున్న కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 15 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులపై ఉక్కుపాదం మోపుతున్నదని కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు ప్రశాంత్‌రెడ్డి, ఆంజనేయులు, శంకర్, హఫీజొద్దీన్, బోజ్జ పవన్, శ్రీనివాస్ చౌదరి తదితరులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులపై కన్నెర్ర చేయడమే కాకుండా చిత్రహింసలు పెడుతూ ఉసురుపోసుకుంటున్నదన్నారు. పదేండ్లుగా కేంద్రం పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించడం లేదన్నారు. రైతు వ్యతిరేకి బీజేపీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

గ్రామాన్ని స్వచ్ఛతలో ఆదర్శంగా నిలుపుదాం

సపాయి కార్మికులను సన్మానిస్తున్న గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శి పద్మ

రామాయంపేట, ఫిబ్రవరి 15: సుతారిపల్లి గ్రామాన్ని స్వచ్ఛతలో జిల్లాలోనే ఆదర్శంగా నిలుపుదామని గ్రామ కార్యదర్శి పద్మ తెలిపారు. గురువారం పంచాయతీ పారిశుధ్య ఉత్సవాలు ముగింపు కావడంతో గ్రామసభ ఏర్పాటు చేసి సపాయి కార్మికులను సన్మానించారు. అనంతరం గ్రామాభివృద్ధికి మాజీ సర్పంచ్ రాగి సంధ్య నేతృత్వంలో తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

నర్సాపూర్, ఫిబ్రవరి 15: మండలంలోని పెద్దచింతకుంట గ్రామంలో మాజీ సర్పంచ్ శివకుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను గురువారం సన్మానించారు. అనంతరం మాజీ సర్పంచ్, సెక్రటరీ సుల్తానా బేగంను మాజీ పాలకవర్గ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటనర్సింగారావు, మాజీ ఉపసర్పంచ్ నాగరాజు, మాజీ వార్డు సభ్యులు మల్లేశ్, ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్ భూలక్ష్మి, ఆశవర్కర్ సంధ్య ఉన్నారు.

పెద్దచింతకుంటలో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ శివకుమార్

బదిలీపై వెళ్తున్న ఎంపీడీవోకు సన్మానం

ఎంపీడీవో జగదీశ్వర్‌చారిని సన్మానిస్తున్న ఎంపీపీ సిద్ధిరాములు, మాజీ సర్పంచ్‌లు

■ నిజాంపేట ఎంపీడీవోగా రాజిరెడ్డి

నిజాంపేట, ఫిబ్రవరి 15 : ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని ఎంపీపీ సిద్ధిరాములు అన్నారు. గురువారం ఎంపీపీ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో జగదీశ్వర్‌చారితోపాటు బదిలీపై వచ్చిన ఎంపీడీవో రాజిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అమరసేనారెడ్డి, నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సురేశ్, ఎంపీవో రాజేందర్, ఏపీవో శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ వినయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులతో పాటు వివిధ గ్రామాల నాయకులు ఉన్నారు.

బీసీలు హక్కుల కోసం ఉద్యమించాలి



బీసీ మున్సిపల్ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

రామాయంపేట, ఫిబ్రవరి 15: బీసీలు హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మెట్టు గంగారాం అన్నారు. గురువారం రామాయంపేటలోని బీసీ సంక్షేమ సంఘం సమావేశం ఏర్పాటు చేసి మున్సిపల్ కమిటీని ఎన్నుకున్నారు. మున్సిపల్ సంఘం అధ్యక్షుడిగా రెడ్డమైన నరేశ్, మండల ప్రధాన కార్యదర్శిగా చిలుక వెంకటేశం, డీ.ధర్మారం బీసీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పిట్ల శ్రీశైలం ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భూమ కిషన్, కోనాపురం వెంకటి, చింతల శేఖర్, మామిడి సిద్ధిరాములు, ఉడుత రాజేశం, వెల్ముల రమేశ్, పోచమ్మల గణేశ్ ఉన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో శతఘటాభిషేకం

రామాయంపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా సమేత వేంకటేశ్వరస్వామికి గురువారం భక్తులు మంగళహారతు లు, నైవేద్యాలు సమర్పించారు. శతఘటాభిషేకం చేశారు. స్వామివారిని పూలతో అ లంకరించి గుడి చుట్టురా ఊరేగింపు చేపట్టారు. నిత్య హోమం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, అభిషేకాలు నిర్వహించారు. – రామాయంపేట, ఫిబ్రవరి 15

భీంరావ్‌పల్లిలో శివాజీ విగ్రహావిష్కరణ

నార్సింగి మండలం భీంరావ్‌పల్లిలో శివాజీ విగ్రహాన్ని గురువారం దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బోయిని భూషణం ప్రారంభించారు. - చేగుంట, ఫిబ్రవరి 15

రామాయంపేట మున్సిపల్

కమిషనర్‌గా దేవేందర్

కలెక్టర్‌కు పూలమొక్కను అందజేస్తున్న కమిషనర్ దేవేందర్

రామాయంపేట, ఫిబ్రవరి 15 : రామాయంపేట మున్సిపల్ కమిషనర్‌గా ఎం.దేవేందర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ రాజర్షిషాను కలెక్టరేట్‌లో కలిశారు. దేవేందర్ ఇప్పటివరకు కామారెడ్డి కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గతంలో ఇన్‌చార్జిగా ఉన్న ఉమాదేవి బదిలీపై వెళ్లారు.

25న ఆవాస విద్యాలయ

వార్షికోత్సవాలు

రామాయంపేట, ఫిబ్రవరి 15: రామా యంపేటలోని వివేకానంద ఆవాస విద్యాలయం 18వ వార్షికోత్సవాలను ఈనెల 25న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం వార్షికోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు.

వెల్దుర్తి ఎంపీడీవోగా

జగదీశ్వరాచారి బాధ్యతలు

వెల్దుర్తి, ఫిబ్రవరి 15 : వెల్దుర్తి ఎంపీడీవోగా జగదీశ్వరాచారీ గురువారం బాధ్యతలు చేపట్టారు. నిజాంపేట ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న జగదీశ్వరాచారి వెల్దుర్తికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ సిద్దిపేట జిల్లాకు బదిలీ అయ్యారు.

యువత 'మత్తు' వీడాలి

చిలిపిచెడ్, ఫిబ్రవరి 15 : యువత గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నర్సాపూర్ ఎక్సైజ్ ఎస్సై రాఘవేంద్ర రావు సూచించారు. గురువారం చిలిపిచెడ్ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక పారిశుధ్యం ముగ్గింపు కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ముసాద్దిక్, కార్యదర్శి కృష్ణ, గ్రామస్తులు దుర్గారెడ్డి, పాండరి, అనిల్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-319437-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గిరిజనులతో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్‌లో సేవాలాల్ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

సేవాలాల్ బోధనలు ఆచరణీయం

■ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్, ఫిబ్రవరి15: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ బోధనలు ఆచరణీయమని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్‌లోని సంత్ సేవాలాల్ మహరాజ్, జగదాంబ ఆలయంలో సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా బంజారాలు నర్సాపూర్ అంబేద్కర్ చౌరస్తా నుంచి సేవాలాల్ ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. జగదాంబ మాతకు, సంత్ సేవాలాల్ మహరాజ్‌కు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సాపూర్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్, జగదాంబ ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. సేవాలాల్ చూపిన శాంతియుత మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. సేవాలాల్ జయంతిని బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా సెలవు రోజుగా ప్రకటించిందని గుర్తుచేశారు. గుడి నిర్మాణానికి సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి తమవంతు కృషి చేస్తామని ఎమ్మెల్యే సునీతారెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకుడు లకావత్ రమేశ్ నాయక్‌ను ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో సేవాలాల్ ఉత్సవాల ప్రత్యేక అధికారి విజయ్‌శేఖర్ రెడ్డి, ఎంపీపీ జ్యోతి, జిల్లా అధికారి జమ్లానాయక్, ఎంఈవో బుచ్చానాయక్, ఎంపీటీసీ సంధ్యారాణి చత్రునాయక్, గిరిజన నాయకులు సామ్యానాయక్, శివాజీ నాయక్, చందర్‌నాయక్, ధన్‌సింగ్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, చంద్రశేఖర్, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

టెట్‌ను నిషేధించాలి

★ ఎస్‌జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం

వెల్దుర్తి, ఫిబ్రవరి 15: టెట్ పరీక్షను సాకుగా చూపుతూ సీనియర్ ఉపాధ్యాయులకు పదోన్నతులు దూరం చేయడం తగదని, వెంటనే టెట్‌ను నిషేధించాలని ఎస్‌జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం డిమాండ్ చేశారు. 2010 కంటే ముందు ఉన్న ఉపాధ్యాయులు డీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి, దశాబ్దాల పాటు పిల్లలకు పాఠాలు బోధించి అనుభవాన్ని సాధించారన్నారు. సీనియర్ ఉపాధ్యాయులకు టెట్‌ను నిబంధన అశనిపాతంగా మారిందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి టెట్‌ను తొలిగించాలని కోరారు.

నీటి సమస్య రావొద్దు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 15: వేసవి కాలంలో నీటి సమస్య రాకుండా మెదక్‌లోని ఎండీవై కాలనీలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఆధ్వర్యంలో బోరు వేయించినట్లు కాలనీ అధ్యక్షుడు వెంకటేశ్ గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ ప్రధాన కార్యదర్శి సంపత్ రణదివే, ఉపాధ్యక్షులు నవీన్ గౌడ్, రాజయ్య, గోపాల్, కోశాధికారి భూపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా

జైత్‌రాంనాయక్ బాధ్యతలు

నర్సాపూర్, ఫిబ్రవరి 15: నర్సాపూర్ మున్సిపల్ నూతన కమిషనర్‌గా జైత్‌రాంనాయక్ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గత కమిషనర్ వెంకట్‌గోపాల్ బదిలీపై వెళ్లారు. మున్సిపల్ సిబ్బంది, జైత్‌రాంనాయక్‌ను సత్కరించి, సేవాలాల్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, సిబ్బంది మధుసూదన్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని

యాచకురాలు మృతి

నర్సాపూర్, ఫిబ్రవరి 15 : ఆర్టీసీ బస్సు ఢీకొని యాచకురాలు మృతి చెందిన ఘటన నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్సై పుష్పరాజ్ కథనం.. నర్సాపూర్ మున్సిపాలిటీ సునీతాలక్ష్మారెడ్డి కాలనీకి చెందిన సంకు దుర్గమ్మ(45) భిక్షాటన చేస్తూ జీవిస్తున్న ది. రోజు మాదిరిగానే బుధవారం భిక్షాటనకు వెళ్తున్నట్లు కుటుంబీకులకు చెప్పి వెళ్లింది. నర్సాపూర్‌లో హమ్ సఫర్ హో టల్ వద్ద రోడ్డు దాటుతుండగా మెదక్ నుంచి నర్సాపూర్ వైపునకు వస్తున్న మెదక్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు(ఏపీ 23జడ్ 0075) అతివేగంతో దుర్గమ్మను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెం దింది. మృతురాలి కుమారుడు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

గిరిజన గురుకులాల్లో

'సీవోఈ' ప్రవేశ పరీక్ష

నర్సాపూర్, ఫిబ్రవరి 15: గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లోని ప్రతిభా జూనియర్ కళాశాలలో ప్రవేశం నిమిత్తం ఈ నెల 18న ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆర్సీ సంపత్‌కమార్ ప్రకటనలో తెలిపారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌లో అల్లూరి సీతారామరాజు గురుకులంలో 343 మంది, కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సరంపల్లి గురుకుల డిగ్రీ కళాశాలలో 330 మంది, నిజామాబాద్ జిల్లాలోని ఇందల్వాయి ఎట్ తిర్మన్‌పల్లి గిరిజన గురుకు ల పాఠశాలలో 258 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఆయా విద్యార్థులు హాల్‌టికెట్‌తోపాటు ఆధార్‌కార్డు, బ్లూ/బ్లాక్ రంగు పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్లు తీసుకుని ఉ దయం 9 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవే శ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

మహిళ కడుపులో

3 కిలోల కణితి తొలిగింపు

చేగుంట, ఫిబ్రవరి 15: మండలంలోని ఉల్లితిమ్మాయిపల్లికి చెందిన సంతోష అనే మహిళ కడుపులో 3కిలోల కణితిని శస్త్రచికిత్స చేసి వైద్యులు తొలిగించారు. సంతోషకు తరచూ కడుపు నొప్పి రావడంతో చేగుంటలోని కేజీఎస్ దవాఖానలో చేరింది. కడుపులో కణితి ఉన్నట్లు గుర్తించి వైద్యుడు నాగ మున్నయ్య శస్త్రచికిత్స చేసి తొలిగించారు.

రెండు లేగదూడలపై చిరుత దాడి

వెంకటాపూర్ శివారులో చిరుత అడుగులను పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

కొల్చారం, ఫిబ్రవరి 15: కొల్చారం మండలంలోని దేవుని వెంకటాపూర్ శివారు దక్కన్ చెరువు సమీపంలో వెంకటేశానికి చెందిన పశువుల పాకలో ఉన్న రెండు దూడలపై చిరుతదాడి చేసింది. దీంతో లేగదూడలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు తెలుపడంతో అటవీశాఖ బీట్ అధికారులు శ్రీలత, శ్రీకాంత్ వచ్చి పంచనామా నిర్వహించారు. చిరుత కాలు ముద్రలు సేకరించారు. గతంలోనూ దేవుని వెంకటాపూర్ శివారులో మేకల మందపై చిరుత దాడి చేయడంతో సుమారు 30 మేకలు మృతి చెందాయి. చాలా ఏండ్ల తరువాత చిరుత దాడి జరగడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

తూప్రాన్‌లో ఇసుక అక్రమ డంప్ సీజ్

తూప్రాన్ పట్టణంలో ఇసుక డంప్‌ను సీజ్ చేస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

తూప్రాన్, ఫిబ్రవరి 15: తూప్రాన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను గురువారం ఎస్సై శివానందం, తహసీల్దార్ విజయలక్ష్మి సీజ్ చేశారు. తూప్రాన్‌లోని భారత్ పెట్రోల్ బంక్ వెనకాల గూడూరి కరుణాకర్ గౌడ్, యాదగిరిగౌడ్ 12 ట్రాక్టర్ల ఇసుకను డంప్ చేసినట్లు వచ్చిన సమాచారంతో తనిఖీ చేసి సీజ్ చేశారు. ఇదే విషయమై తహసీల్దార్ విజయలక్ష్మిని వివరణ కోరగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను డంప్ చేయకూడదన్నారు. ఒకవేళ ఎవరైనా ఇండ్లు నిర్మించుకోవాలనుకుంటే సరైన వే బిల్లులతో వినియోగదారుల ఇండ్ల వద్దే ఇసుకను అన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.